క్లుప్తంగా

ఎరువుల కొనుగోలుకు రూ. 20 వేల రుణం


మాట్లాడుతున్న చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

చొప్పదండి: వ్యవసాయ రుణాలు పొందిన సభ్యులకు అదనంగా ఎరువులు, పురుగుల మందుల కొనుగోలుకు రూ. 20 వేల రుణం అందించనున్నామని జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డు గ్రహీత వెల్మ మల్లారెడ్డి ప్రకటించారు. మండల కేంద్రంలో శుక్రవారం చొప్పదడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. పంట రుణాల రెన్యువల్, పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత రుణాలను రికవరీ చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సంఘం ద్వారా యాసంగిలో 94,984 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందుకు సహకరించిన సిబ్బందికి, రైస్‌మిల్లర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కొనుగోలు ద్వారా సంఘానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరుతుందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మహేశ్, డైరెక్టర్లు ఆనందరెడ్డి, బాలయ్య, లక్ష్మారెడ్డి, మల్లయ్య, మల్లారెడ్డి, రాజిరెడ్డి, నర్సయ్య, కొమురయ్య, తిరుపతిరెడ్డి, పద్మ, సీఈవో తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

చొప్పదండి: నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపించినందున పనులు వెంటనే పూర్తి చేసి రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతులు


బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై శుక్రవారం పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ తెలిపారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థినికి సన్మానం



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొత్తపల్లి వైష్ణవి పదో తరగతిలో ఫలితాల్లో 10జీపీఏ సాధించగా శుక్రవారం డీఈవో జనార్దన్‌రావు విద్యార్థినిని సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు వైష్ణవిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మమతాగౌతమి, ఉపాధ్యాయుడు చక్రధర్ ఉన్నారు. విద్యార్థి సమన్వయకర్త వెంకటేశ్, అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ ఏ. కొమురయ్య, గౌరీపుండలిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి యోగేశ్ పుండలిక్, పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లే మండలంలోని మోతెవాగుపై రామడుగు సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయని బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ ప్రకటనలో విమర్శించారు. అసంపూర్తి బ్రిడ్జితో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని, ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నెలకు సరిపోక.. బయట కొనలేక

- ఇబ్బందిపడుతున్న సామాన్య ప్రజలు
- రేషన్‌షాపుల ద్వారా బియ్యం మాత్రమే సరఫరా
- గతంలో తొమ్మిది రకాల సరుకులు వచ్చేది
- ముక్కిన బియ్యం తినలేక, వద్దనలేక అవస్థలు
- అమలుకాని సన్నబియ్యం పంపిణీ

చిగురుమామిడి: రేషన్‌షాపుల ద్వారా బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ఇచ్చే బియ్యం నెలంతా సరిపోక బయట మార్కెట్‌లో రూ.వందలు చెల్లించి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో రేషన్ దుకాణాల్లో తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేసేవారు. కానీ ప్రస్తుతం బియ్యం మాత్రమే అందిస్తుండటంతో ప్రజలు మిగతా సరుకులు మార్కెట్‌లో కొనుగోలు చేయలేకతున్నారు.


బొమ్మనపల్లిలో ఎలక్ట్రానిక్ మిషన్‌పై బియ్యం బస్తా తూకం

మండలంలోని 17 గ్రామాల్లో సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు రేషన్ దుకాణాల్లో దొరికే సరుకులు సరిపోక, బయట మార్కెట్‌లో కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 27 రేషన్ షాపులున్నాయి. 12,778 తెలుపు, అంత్యోదయ అన్నయోజన కార్డులున్నాయి. ప్రతినెలా 23,588 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. రేషన్ సరుకులపై ప్రభుత్వం క్రమక్రమంగా సబ్సిడీ ఎత్తివేసింది. గతంలో బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమలు, కంది పప్పు, చింతపండు, కారంపొడితో పాటు ఇతర రకాల సరుకులు వచ్చేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరుకులపై సబ్సిడీ ఎత్తివేయడంతో పేదలకు అన్యాయం జరుగుతోంది.

మండుతున్న ధరలు

ఒకరికి ప్రభుత్వం ఇచ్చే ఆరుకిలోల బియ్యం నెలంతా సరిపోవడం లేదు. మార్కెట్‌లో కిలో బియ్యం రూ.40 నుంచి రూ.50 కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గోధుమలు, పిండి కిలో రూ.55, చక్కెర కిలో రూ.40 కొనుగోలు చేస్తున్నారు. కిరోసిన్ మొత్తానికే బ్యాన్ చేశారు, మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్ర జల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని గొప్పలు చెబుతున్నా ఆరుకిలోల బియ్యం ఎలా సరిపోతాయనే ఆలోచన రాకపోవడం విడ్డూరం. రేషన్ దుకాణాలను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలస్యంగా బియ్యం సరఫరా

ఇచ్చే కొద్దిపాటి బియ్యం పంపిణీలో ఆలస్యం అవుతోందనే విమర్శలున్నాయి. ప్రతినెలా ఐదో తేదీ నుంచి బియ్యం పంపిణీ కావాల్సి ఉన్నా పదో తేదీ వరకు గ్రామాలకు సివిల్ సప్లై గోదాం నుంచి బియ్యం దిగుమతి కావడం లేదు. ప్రజలకు సన్నబియ్యం ఇస్తామని సీఎం కేసీఆర్ ఏడాది క్రితమే ప్రకటించినా నేటికీ ఆచరణకు నోచుకోలేదు. ముక్కిన బియ్యం తినలేక కాదనలేక పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు.

బియ్యం సరిపోవడం లేదు



ప్రతినెలా రేషన్ దుకాణం ద్వారా పంపిణీ చేసే ఆరుకిలోల బియ్యం నెల మొత్తం సరిపోవడం లేదు. మేం ముగ్గురం కుటుంబ సభ్యులం. మళ్లీ బయట దుకాణాల్లో కిలోకు రూ.45 చెల్లించి కొనుక్కుంటున్నాం. కనీసం పది కిలోలు ఇచ్చినా సరిపోయేవి. ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించాలి.

– కయ్యం వీరన్న, లంబాడిపల్లి

సన్నబియ్యం పంపిణీ చేయాలి



మా కుటుంబంలో నలుగురు ఉన్నారు. బియ్యం మాత్రమే ఇవ్వడంతో మిగతా సరుకులు మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. చక్కెర, కిరోసిన్, పప్పులు, ఉప్పు పంపిణీ లేదు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టినా అమలు చేయకపోవడం విడ్డూరం.

– మంద శ్రీనివాస్, గాగిరెడ్డిపల్లి

ఐదో తేదీలోపు అందేలా చర్యలు



మండలంలోని అన్ని రేషన్‌షాపులకు ప్రతినెలా ఐదో తేదీలోపు సరుకులు అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం అందించిన బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నాం. సన్నబియ్యం పంపిణీ మా పరిధిలో లేదు.

– జింక జయంత్, తహసీల్దార్

విద్యార్థులకు ప్రోత్సాహకం


నగదు అందిస్తున్న యువకులు

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల 2022–23 పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాలలో పనిచేసి స్వర్గస్థులైన చెరుకు సుధాకర్‌రెడ్డి (పీఈటీ) జ్ఞాపకార్థం కూతురు ఎన్ఆర్ఐ అర్చన అందించిన రూ. ఐదువేల నగదును గ్రామంలోని యువకులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువకులు బండపెల్లి శ్రీకృష్ణ, కాడె వెంకటేష్, తోర్తి శ్రీనివాస్, పెరుమండ్ల హరీష్, పల్ల రాజు, రమేష్, హరీష్, మధు, శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్స్ ప్రారంభం



రామడుగు: మండలంలోని గుండి గ్రామం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్‌ను శుక్రవారం సాయంత్రం సర్పంచ్ గుండి మానస ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో లైట్స్ ఏర్పాటు చేస్తున్నామ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు అంజమ్మ, రమేష్, పర్శరాం, లచ్చయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు మాజీ మంత్రి సంఘీభావం

గంగాధర: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు వెంటనే పరిహారం అందించాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు సుద్దాల దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రంగరావుపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులు మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆర్డీవోతో మాట్లాడగా.. పదిహేను రోజుల్లో నిర్వాసితులకు పరిహారం విడుదల చేస్తామన్నారని తెలిపారు. పరిహారం విడుదల చేయకుంటే బాధిత రైతులతో కలసి ఆర్డీవో కార్యాలయం ముట్టడిస్తామన్నారు. చుట్టు పక్కల గ్రామాల నిర్వాసితులకు పరిహారం అందించిన ప్రభుత్వం రంగరావుపల్లి నిర్వాసితులకు ఎందుకివ్వడం లేదని విమర్శించారు. వెంట స్థానిక బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నిరాహారదీక్షలో సుద్దాల దేవయ్య

గర్శకుర్తిని మండల కేంద్రంగా ప్రకటించాలి

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మండల సాధన కమిటీ నాయకులు 55 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎన్నికలకు ముందు మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేలు హామీలు ఇస్తూ గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీ అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పురమల్ల మనోహర్, రామిడి రాజిరెడ్డి, చిప్ప లావణ్య చక్రపాణి, బట్టు లక్ష్మినారాయణ, రుద్రమల్లేశం, శంకరయ్య, శ్రీధర్, గుండా రాజేశం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

‘రాములోరి సాక్షిగా బహిరంగ చర్చకు రావాలి’

ఇల్లందకుంట: దళితబంధు విషయంలో సీఎం కేసీఆర్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జూలై ఒకటిన రాములోరి సాక్షిగా ఎంపీపీ సరిగొమ్ముల పావనితో చర్చకు రావాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం స్థాయి కాదు, దళితబంధు గూర్చి మాట్లాడే నైతిక హక్కు లేదదన్నారు. ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో ఏ ఒక్క రోజు అసెంబ్లీలో దళితుల గూర్చి మాట్లాడలేదని, బీజేపీలో అసంతృప్తితోనే కేసీఆర్, కౌశిక్‌రెడ్డిపై మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఏద్దేవా చేశారు. ఎమ్మెల్యే, మంత్రిగా అవకాశం ఇచ్చినా కేసీఆర్, పార్టీకి ద్రోహం చేసి, నిరాధారంగా మాట్లాడితే నియోజకవర్గంలో తిరగనివ్వం హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ, సంజీవరెడ్డి, పోడేటి రామస్వామి, రఫీఖాన్, మొగిలి, రాకేష్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, కొంరెల్లి, ఓదెలు, అశోక్, లాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగతంగా విమర్శిస్తే ఊరుకోం

జమ్మికుంట: నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని బీజేపీ ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే ఊరుకోమని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, రాజకీయ ఉనికి కోసం మాట్లాడొద్దన్నారు. కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఎవరికి లేదని, అభివృద్ధి సంక్షేమంపై మోదీ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. వేల కోట్లతో కరీంనగర్‌ను అభివృద్ధి చేసిన ఘనత ప్రభుత్వానిదేనని, దశాబ్ది ఉత్సవాలపై విమర్శలు తగదన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఏరియా, సెంటర్ మేనేజర్ ఖాజాబీ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, ఆచారాలతో వితంతువులను శుభకార్యాలకు దూరంగా ఉంచటం, కించపరిచేలా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల, కార్యదర్శి సరిత, తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎండీ. రఫీఖాన్ మాట్లాడారు. సమాజంలోని వితంతువులపై వివక్షచూపొద్దన్నారు. మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజలు అవగాహన ఉండాలన్నారు. వితంతువులు ప్రతి అంశంలోనూ ధైర్యంగా, మానసికంగా బలంగా ఉండాలని, సమాజం వారిని చిన్నచూపు చూడొద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో బాలవికాస సభ్యులు సులోచన, సంధ్య, సుమలత, జేకే పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు కంప్యూటర్ రంగంపై మరింత పట్టు సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉద్యోగ సాధనలో విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్తే ఉద్యోగ సాధన కష్టం కాదన్నారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. రిజిస్ట్రార్ పి. వెంకటయ్య, కార్యక్రమ సమన్వయకర్త అధ్యాపకుడు ప్రదీప్, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మల్లయ్య, వివిధ విభాగాల అధిపతులు, పాల్గొన్నారు.

ఆరోగ్యలక్ష్మి సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. చొప్పదండిలోని హెల్త్ సెంటర్ ఆరోగ్యలక్ష్మి కోసం ఎంపికైందని, సెంటర్‌లో గర్భిణులకు వివిధ పరీక్షలతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని చెప్పారు. శుక్రవారం భోజన నాణ్యతను, గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, మెడికల్ ఆఫీసర్ రమాదేవి, సీహెచ్‌వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి

మానకొండూర్: కేంద్రం నిధులతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించారు. దేశానికి మోదీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడు

తిమ్మాపూర్: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండలంలోని కొత్తపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కాశ్మీర్‌కు విముక్తి కల్పించిన గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని, దేశ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసేది బీజేపీ, ప్రతీ భారతీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని మననం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షుడు గడ్డం అరుణ్, జెల్ల విజయ్, గడ్డం సతీష్, మార్క నరేష్, మామిడి బాబు, సుంక పోచయ్య, ఎల్కతుర్తి రాజయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్: నివాళి అర్పిస్తున్న జగదీశ్వరచారి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

గంగాధర: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్రంలోని పీఎం నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, చేపట్టిన పథకాలపై శుక్రవారం బీజేపీ నాయకులు మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హిమ్మత్‌నగర్ గ్రామంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య ప్రచారం చేశారు. నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్, మనోహర్, ప్రణయ్, నాగరాజు, శేఖర్, అభిలాష్, మల్లిఖార్జున్ తదిరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: తొమ్మిదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని 10.7 కోట్ల మంది కటుంబాలకు ఆరోగ్యభీమా కవరేజీ స్కీమ్ ప్రవేశపెట్టారని, అలాగే 4.5 కోట్ల ప్రజలకు ఆయుష్మాన్‌భారత్ ద్వారా ఉచిత వైద్యసౌకర్యం కల్పించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని రేకొండలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని వైద్యశాలలను బలోపేతం చేసేదిశగా వేల కోట్లు ఖర్చుచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు డి. లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కంది శంకర్, నాయకులు మాజీ సర్పంచ్ వంగర మల్లేశం, గందె చిరంజీవి, కారంపూరి వెంకటేశ్వర్లు, కసాని సతీష్, వివిధ బూత్‌ల అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


రేకొండలో ప్రచారం చేస్తున్న శ్రీరాంచక్రవర్తి

ఆంజనేయులు కుటుంబానికి ఆర్థికసాయం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు కుటుంబానికి హుస్నాబాద్ నియోజకవర్గ సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి రూ. రెండు లక్షల ఆర్థికసాయం అందించారు. ఆంజనేయులు ఏప్రిల్ 7న హుస్నాబాద్‌లో క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఆమె శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో ఆంజనేయులు భార్య, తల్లికి రూ. రెండు లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, ఉపసర్పంచ్ జంగ శ్రీనివాస్ రెడ్డి, మంజులక్క యువసేన మండల అధ్యక్షుడు మంద శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు కంది తిరుపతిరెడ్డి, నాంపల్లి కొంరయ్య, వంతడ్పుల దిలీప్‌కుమార్, తాళ్లపెల్లి సంపత్‌కుమార్, పెసరి శ్రీనివాస్ పలువురు ఉన్నారు.


చెక్కు అందిస్తున్న మంజులారెడ్డి

సంక్షిప్త వార్తలు

బీఈడీ విద్యార్థుల సందర్శన

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్కెట్ యార్డ్, అలాగే బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం కరీంనగర్ వాణినికేతన్ బీఈడీ విద్యార్థులు సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలు వైద్యాధికారి కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలోనే గదులను పరిశీలించారు. మార్కెట్ యార్డులో పలు అంశాలను అధ్యయనం చేశారు.

కౌశిక్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై ఓ యూట్యూబ్ కెమెరామెన్ శుక్రవారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా వీడియో చిత్రీకరిస్తున్న సమయంలో విప్ అనుచరులు కెమెరాను లాక్కొని, అసభ్యపదజాలంతో దూషించి బెదిరింపులకు గురి చేశారని, తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్టు కెమెరామెన్ తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

హుజూరాబాద్: ప్రతిపక్ష నాయకులు విమర్శలు మానుకొని పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గందె శ్రీనివాస్ కోరారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. అమరవీరుల స్తూపంపై కొంతమంది రాజకీయరంగు పులమడానికి ప్రయత్నం చేస్తున్నారని, పాత స్తూపం ఉన్నచోట అపరిశుభ్ర వాతావరణం ఉన్నందున దాన్ని తొలగించి అంబేడ్కర్ కూడలిలో కొత్త స్తూపం ఏర్పాటు చేశామని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై ఈటల ఆరోపణలు అర్థరహితమన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

జమ్మికుంట: రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు.

గడీల పాలన తప్పా అభివృద్ధి తెలియదు

మానకొండూర్: సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుకు గడీల పాలనే తప్పా అభివృద్ధి తెలియదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అభివృద్ధి చేయలేదనడం జీవీ అవివేకానికి నిదర్శనమని అన్నారు. రైల్వే స్టేషన్‌తో పాటు పాస్ పోర్టు కార్యాలయం, మెడికల్ కాలేజ్, శాతవాహన యూనివర్సిటీ, మానకొండూర్‌లో ప్రభుత్వ కాలేజ్ , ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు తెచ్చిన ఘనత ప్రభాకర్‌దేనని అన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ గ్రామం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం సర్పంచ్ కోడిగూటి శారదప్రవీణ్ సొంత ఖర్చులతో బస్సు ఏర్పాటు చేశారు. శుక్రవారం విద్యార్థులతో కలిసి బస్సును ప్రారంభించారు. తమవంతు బాధ్యతగా విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించామని, ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు అహర్నిశలు పాటుపడుతానని తెలిపారు. సర్పంచ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

